## క్లుప్తంగా

### ఉత్సాహంగా ఆటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

**అక్కిరెడ్డిపాలెం:** సీపీఎం సీనియర్ నాయకుడు జి.సుబ్బారావు వర్ధంతిని పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం 69వ వార్డు శీలానగర్‌లో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఐద్వా నాయకురాలు వై.సత్యవతి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై, కార్మికుల సమస్యలపై స్వర్గీయ సుబ్బారావు అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు.విజేతలకు ఏప్రిల్ 1న బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జి.మణి, ఎస్.నాగవేణి, ఎం.మాధవి, డి.శ్రీదేవి, మాధు రి, సునీత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

### ప్రేరణతో మానసిక పరిపక్వత



షబానా అజ్మీని సత్కరిస్తున్న అధ్యాపకులు

**అగనంపూడి:** విద్యార్థులు మానసిక పరిపక్వత పొందేలా ప్రేరణ అవసరమని విష్ణాస్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ సైకాలజిస్టు షబానా అజ్మీ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం మానసిక ఆరోగ్యంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ప్రసంగించారు. విద్యార్థులు మానసిక ఆందోళన, ఒత్తిడిని అధిగమించడానికి అవసరమైన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, డీన్ ఆర్ సుందర్ రామమ్ పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయి ప్రతినిధులు

**ఉక్కునగరం:** స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఏటా వేసవి సందర్భంగా సత్యసాయి సమితి ఆధ్వర్యంలో ఉక్కు జనరల్ ఆస్పత్రి కూడలి వద్ద చలివేంద్రం ఏర్పాటు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండడంతో 10వ తరగతి విద్యార్థుల సౌకర్యార్థం సెక్టార్-6లోని విశాఖ విమల విద్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు మజ్జిగ పంపిణీ చేశారు. సత్యసాయి సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

### రేపు ఐటీఐలో జాబ్ మేళా

**పెదగంట్యాడ:** ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి శాఖ సంయుక్తంగా ఐటీఐ పాస్ అయిన, అప్రెంటిస్ , డిగ్రీ , డిప్లమో, ఇంజినీరింగ్ అభ్యర్థులకు గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వీల్స్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,744 నుంచి రూ.27వేల వరకూ జీతంతో పాటు వసతి, భోజన సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 19న ఉదయం ఐటీఐలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

### చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్-2 విభాగంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలు.. అచ్యుతాపురం మండలం రామన్నపాలేనికి చెందిన తరిమిరెడ్డి నర్సింగరావు స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్-2 విభాగంలో స్కిల్డ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 13న అతను నైట్‌షిఫ్ట్‌కు విధులకు హాజరయ్యాడు. రాత్రి ఒంటి గంట సమయంలో చెకింగ్ విధులు నిర్వహిస్తుండగా సుమారు 7 అడుగుల ఎత్తు నుంచి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికి.. ఆ తర్వాత నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతను చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ కావడంతో ఆదివారం మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**నాడు** ప్రజలకు పాలన చేరువ చేయడంతో పాటు సేవలు ఇంటికే అందించాలన్న లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని ఇళ్లకే పంపించి సంక్షేమ పథకాలు అందించారు. సులభంగా ధ్రువ పత్రాలు జారీ చేసేవారు. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులతో పాటు **పింఛన్లు ఎప్పటికప్పుడు అందించేవారు.**



సిబ్బంది సర్వేలో ఉన్నారంటూ 76వ వార్డు గాంధీనగర్ **సచివాలయ ముఖద్వారానికి అతికిన చీటి**

**నేడు** సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను నిలిపేసింది. సచివాలయ సేవలను నామమాత్రం చేసింది. అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా ఇంత వరకూ కొత్తరేషన్ కార్డులు, పింఛన్లు అందించడం లేదు. దీంతో అర్హత ఉన్న వారు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మరో వైపు సర్వేల పేరిట సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి పెంచింది.దీంతో సిబ్బంది పలు చోట్ల తాళాలు వేసి సర్వేలో పాల్గొంటున్నారు. ఆ సమయంలో సచివాలయానికి వెళ్లే ప్రజలు ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు.

# సేవలకు మంగళం!



బోసిపోయిన సచివాలయం

సర్వేలతో హడావుడి / సిబ్బందిపై పెరుగుతున్న ఒత్తిడి / కొత్త రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు నిల్ / పలు సచివాలయాలకు తాళాలు / ఉద్యోగులను నిలదీస్తున్న ప్రజలు / నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ

**పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గంలో 107 సచివాలయాలు ఉన్నాయి. సుమారుగా 960** మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందజేశారు. ప్రస్తుతం దీనికి పూర్తిగా భిన్నమైన పాలన సాగుతోంది.

**కొత్త రేషన్‌కార్డులు మంజూరెప్పుడో!**

కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు షాక్ ఇస్తోంది. ఇప్పటి వరకు ఒక్క కొత్త రేషన్ కార్డు మంజూరు చేసిన దాఖలాలు లేవు. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అక్కడ సమాధానం చెప్పడానికి సిబ్బంది ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉద్యోగులపై పనిభారం

సర్వేల పేరుతో తీవ్ర పనిభారం మోపుతుందని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ విధుల్లో పాల్గొనడం, ఉన్నతాధికారుల జూమ్ కాన్ఫరెన్సులు, ఫోన్ కాన్ఫరెన్సులతో క్షణం తీరిక లేకుండా పోతుందని వాపోతున్నారు. సర్వేలతో కుటుంబసభ్యులతో కొద్ది సేపైనా గడిపే పరిస్థితి లేకుండా పోయిందని మహిళా ఉద్యోగులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



వార్డులో సర్వే చేస్తున్న సిబ్బంది

**తెరుచుకోని పింఛన్ల వెబ్‌సైట్**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కొత్త పింఛన్ల పై కార్యాచరణ రూపొందించ లేదు. గతేడాది అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని నాయకులు ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఇంత వరకూ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదు. పింఛన్ అందుకుంటూ మృతి చెందిన భర్త లేదా భార్యకు మాత్రమే గత నెల పింఛన్ మంజూరుకు అవకాశం కల్పించారు.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో.**

పార్టీలతో సంబంధం లేకుండా వైఎస్సార్ **సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వలంటీర్ ఇంటికి వచ్చి దరఖాస్తు పూర్తి చేసి సచివాలయం**లో ఇస్తే పింఛన్లు మంజూరమయ్యేవి. కానీ ఇప్పుడు అర్హత ఉన్నా వితంతవులు, దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు కోసం సచివాలయాలకు వెళ్లి నిరాశతో వెనుతిరుగుతున్నారు.

**సర్వేతో గుండెల్లో గుబులు**

పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వే కొనసాగుతోంది. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో నిర్వ**హిస్తున్నామ**ని అధికారులు చెబుతున్నారు. అయితే **27 ప్రశ్నలకు** సమాధానాల సేకరణతో పథకాలు తీసి వేస్తారేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సర్వేపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు కూడా విఫలమయ్యారు.

**సచివాలయానికి తాళాలు**

సర్వేలతో సచివాలయ సిబ్బంది బయట విధులు నిర్వహిస్తున్నాం. సచివాలయాల్లో సేవలు అందుబాటులో లేవు. సిబ్బంది అందుబాటులో లేరు. సచివాలయానికి రావద్దని కొన్ని సచివాలయాలకు సిబ్బంది నోటీసులు అతికించడం విశేషం.

### సచివాలయాల్లో సేవలు అందించాలి



ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సచివాలయాల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. నేను మూడు నెలలుగా గాంధీనగర్ సచివాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మా నాన్నగారి పింఛన్ కోసం అడగడానికి వెళితే సచివాలయంలో సిబ్బంది సరిగ్గా ఉండడం లేదు. అడిగితే సర్వేలో ఉన్నారని చెబుతున్నారు. ఒకవేళ ఉన్నా దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ ఇంకా ఓపెన్ కాలేదు అని చెబుతున్నారు. దీంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తుంది. అధికారులు, నాయకులు చొరవ తీసుకుని సచివాలయాల్లో అన్ని సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.

– కె నరేష్, నడుపూరు

### కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలి



ఇటీవలే నాకు వివాహం జరిగింది. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయడానికి సచివాలయానికి వెళ్తున్నాం. సచివాలయం సిబ్బంది ప్రభుత్వం నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని..అందు వల్ల దరఖాస్తులు స్వీకరించలేమని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల విషయంలో ఉత్తర్వులు జారీచేయాలి..అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి.

– పి అరుణ, పెదగంట్యాడ

### అన్నదాన మూలనిధికి విరాళం



విరాళం అందజేసిన దాతలు

**అక్కిరెడ్డిపాలెం:** శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం అన్నదాన మూలనిధికి సోమవారం మిందికి చెందిన పాపారావు, అంజలి దంపతులు రూ.28000లు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. వారికి స్వామి దర్శనం కల్పించారు.

### వేతన బకాయిలు చెల్లించాలి

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం జి. పురుషోత్తమన్‌ను సోమవారం కలిసి సత్కరించారు.గతేడాది సెప్టెంబర్ నుంచి వేతన బకాయిలు ఉన్నాయన్నారు. మార్చి నెలాఖరు వస్తున్నందున పూర్తి బకాయిలు చెల్లించాలన్నారు. వీఆర్‌ఎస్ వల్ల కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందన్నారు. తద్వారా ఉన్న కార్మికులపై పనిభారం పెరుగుతుందన్నారు. ప్లాంట్ ఉత్పత్తికి సహకరిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించాలని చూడడం తగదన్నారు. ప్లాంట్‌లో చాలా వరకు ఉన్న భద్రతా లోపాలు ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్, చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు, కొమ్ము ప్రసాదరావు, మద్ది అప్పలరాజు, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ. నాయుడు, సాహు, కోరిబిల్లి అప్పారావు, మింది దేముడు, కోరాడ వెంకటరావు పాల్గొన్నారు.

### నేడు కూర్మన్నపాలెంకు ‘సమృద్ధ్ సంరక్షణ’ ర్యాలీ

**ఉక్కునగరం:** కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది చేపట్టిన సమృద్ధ్ సంరక్షణ సైకిల్ ర్యాలీ మంగళవారం కూర్మన్నపాలెం చేరనుంది. సీఐఎస్ఎఫ్ ఏర్పాటై 55 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సీఐఎస్ఎఫ్‌కు చెందిన 60 మంది సభ్యుల బృందం సముద్రతీర ప్రాంత ప్రజల్లో దేశభద్రత, సమైక్యతను పెంపొందించే లక్ష్యంతో సమృద్ధ్ సంరక్షణ సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. 6500 కి.మీ పైగా నిర్వహించనున్న ర్యాలీ ఈనెల 7న పశ్చిమ బెంగాల్‌లోని బక్కల్ నుంచి ప్రారంభమైంది. ర్యాలీ కూర్మన్నపాలెం నుంచి అన్నవరం, అమలాపురం మీదుగా కన్యాకుమారి వరకు సాగుతుంది. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వారిని ప్రోత్సహించాలని స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ హనీఫ్ కోరారు.

### టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రమణ

**పెదగంట్యాడ:** మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జోన్-1 రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీ రమణ, ఐటీఐ ఐఎంసీ చైర్మన్ ఏకే బాలాజీ అన్నారు. ప్రభుత్వ న్యూ ఐటీఐలో టాటా స్ట్రైవ్ అండ్ సీమెన్స్ ఆధ్వర్యంలో కంప్యూటర్స్‌లో కొత్త టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీపై ఐదు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం టాటా గ్రూప్‌కు చెందిన మాస్టర్ ట్రైనర్ డాక్టర్ జాఫిన్, స్నేహాల్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ఆక్రమణల తొలగింపు



కొత్తగాజువాక రాజీవ్‌మార్గ్‌లో దుకాణాలను తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు

**అక్కిరెడ్డిపాలెం:** కొత్తగాజువాకలోని రాజీవ్ మార్గ్‌లో అడ్డంగా పెట్టిన కూరగాయల దుకాణాలను సోమవారం ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. జీవీఎంసీ సహకారంతో దుకాణాల తొలగింపును చేపట్టారు. నిర్దేశించిన స్థలంలో వ్యాపారాలు చేసుకోవాలని ఆదేశించారు.

# ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



గాజువాక హైస్కూల్‌లో ..



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్ పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

**గాజువాక:** పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గాజువాక పరిధిలో ఏర్పాటు చేసిన 19 పరీక్షా కేంద్రాల్లో 4,134 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 4,120 మంది హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి విశ్వనాథం తెలిపారు. మొత్తం 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద పోలీసు ఆంక్షలను పటిష్టంగా అమలు చేశారు. స్క్వాడ్ సిబ్బంది పరీక్షా కేంద్రాలను దగ్గరుండి పరిశీలించారు. చైతన్యనగర్‌లోని కేంద్రాల వద్ద యథావిధిగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఆ ప్రాంతంలోని పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడంతో విద్యార్థులు ప్రశాంతగా పరీక్షలు రాశారని ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా పలు పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు.

**పెదగంట్యాడ:** మండలంలోని నాలుగు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షలకు 1234 మందికి గానూ 1223 మంది విద్యార్థులు హాజరయ్యారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ-సెంటర్‌లో 186 మంది విద్యార్థులకు 184 మంది పరీక్ష రాశారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బి-సెంటర్‌లో 250కి 250 మంది పరీక్ష రాశారు. ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఉర్దూ కలిపి 206 మందికి 202 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 103 మందికి గానూ 101 మంది హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. బీసీ రోడ్డులోని చైతన్య స్కూల్‌లో 239 మందికి 239 మంది విద్యార్థులు హాజరయ్యారు. గంగవరం రోడ్డులోని విశాఖ విమల విద్యాలయం 250 మందికి 247 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యాశాఖాధికారులు ఇమంది శ్రీనివాస్, కంకటాల రమణాజీ ఏర్పాట్లు చేశారు. మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ కామేశ్వరరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కణితిలో..**

**కూర్మన్నపాలెం:** పదో తరగతి పరీక్షలు కణితి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి.మొదటి రోజు కావడడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా పాఠశాల వద్దకు చేరుకున్నారు. 201 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి 10 గదులు కేటాయించారు. కాగా రూం నెంబర్ 9 లో నలుగురు, రూం నెంబర్ 10లో ఐదుగురు మాత్రమే పరీక్షలు రాశారని అధికారులు తెలిపారు. పరిసర ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ప్రశాంతంగా తొలిరోజు పరీక్షలు**

**అక్కిరెడ్డిపాలెం:** జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది జిల్లా పరిషత్ పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8 నుంచి చేరుకోవడం ప్రారంభించారు. 9 గంటల నుంచి విద్యార్థులను పోలీస్ సిబ్బంది, నిర్వాహకులు క్షుణ్ణంగా పరిశీలించి అనుమతించారు. అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 199 మంది విద్యార్థులను కేటాయించగా అందరూ పరీక్షకు హాజరయ్యారని ఇన్‌చార్జి కుమారస్వామి తెలిపారు.

• మింది జిల్లా పరిషత్ హై స్కూల్లో 137 మందికి గానూ ఒకరు గైర్హాజరు కాగా 136 మంది హాజరయ్యారని హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ తెలిపారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 31 మందికి గానూ 28 మంది పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులతో వచ్చిన కుటుంబ సభ్యులు దగ్గరలోని చెట్ల కింద, షెడ్లకింద, ఆలయాల పరిసరాల్లో సేదతీరారు.

**విద్యార్థుల్లో ఉత్సాహం**

**అగనంపూడి:** పదోతరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాల వద్ద విద్యార్థులు ఉత్సాహంగా కనపడ్డారు. అగనంపూడి, లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు తల్లిదండ్రులతో కలిసి చేరుకున్నారు. ప్రీఫైనల్, గ్రాండ్ టెస్ట్‌ల్లో వచ్చిన ప్రశ్నలే ఎక్కువగా రావడంతో విద్యార్థుల ఉత్సాహంగా రాశారు.



చైతన్యనగర్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల రద్దీ



గాజువాక హైస్కూల్‌లో నంబర్లు చూసుకొంటున్న విద్యార్థులు



గంగవరం పాఠశాల వద్ద విద్యార్థుల సందడి



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సందడి



మింది జెడ్పీ హై స్కూల్ పరీక్షా కేంద్రంలో ..



అగనంపూడి హైస్కూల్ వద్ద తల్లిదండ్రులతో..

# నిలువ నీడ కరువాయె!

• మండుటెండలో బస్సుల కోసం నిరీక్షణ
• పాతగాజువాకలో దుస్థితి



ఎండకు తాళలేక ఆర్టీసీ కౌంటర్‌నీడకు చేరిన విద్యార్థినులు



బస్సు వచ్చేవరకు ఎండలోనే...



పాతగాజువాక జంక్షన్‌లో ప్రయాణికుల అవస్థలు

**గాజువాక:** ఓ వైపు ఎండలు, మరోవైపు ఉక్కపోతతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పాతగాజువాక జంక్షన్‌లో బస్సుషెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు నిలువ నీడ కోసం అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం ఎండలోనే పడిగాపులు కాస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ విషయం తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అటు అనకాపల్లి, ఇటు సింధియావైపు వెళ్లాలంటే పాతగాజువాక జంక్షన్‌లో బస్సులు ఎక్కాలి. బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే నిరీక్షించాల్సి వస్తోంది. కొంతమందిమాత్రం చేసేది లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పాతగాజువాకలోని స్టేట్ ఇండియా దిగువన ఒక షెల్టర్ ఉన్నప్పటికీ అది ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారిపోయింది. వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ వేడిమికి తాళలేక విలవిల్లాడుతున్నారు.